క్లుప్తంగా

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కాళ్ల: మండలంలోని సీసలిలో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయం శాశ్వత అన్నదాన పథకానికి భీమవరం వాస్తవ్యులు కాజా పార్థ సారథిరావు, పుష్పవతి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని సోమవారం అందజేశారు. దాతలను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతిదేవి బాబా వారి శేషవస్త్రం, ప్రతిమతో సత్కరించారు.

'స్పందన'కు 9 ఫిర్యాదులు

ఆకివీడు: 'స్పందన'లో 9 ఫిర్యాదులు అందినట్లు ఎంపీడీఓ రామకృష్ణ సోమవారం చెప్పారు. ఆయా ఫిర్యాదులను పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు బట్వాడా చేయించినట్లు తెలిపారు.

వాసవీ క్లబ్ కార్యవర్గ ప్రమాణం



అజయ్ చంద్రక్యను అభినందిస్తున్న సీనియర్ ప్రెసిడెంట్ మడిపల్లి భాస్కరం

పెనుగొండ: సమాజంలో సేవా తత్పరత, దాతృత్వానికి నిదర్శనంగా ఆర్యవైశ్యులు నిలుస్తున్నారని సీనియర్ వైశ్య ప్రెసిడెంట్ మడిపల్లి భాస్కరం అన్నారు. పెనుగొండ మహాలక్ష్మి టవర్స్‌లో నిర్వహించిన వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొన్నారు. 2024 సంవత్సరానికి వాసవీ క్లబ్ మిత్ర ఇంటర్నేషనల్ అధ్యక్షుడుగా గ్రంధి అజయ్ చంద్రక్య, జనరల్ సెక్రటరీగా అత్యం సత్యనారాయణమూర్తి, కోశాధికారిగా నార్కెడమిల్లి సూర్య ప్రభాకరరావులు ప్రమాణస్వీకారం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షుడు గ్రంధి లక్ష్మీనారాయణ (రాము) మాట్లాడుతూ వాసవీ క్లబ్ మిత్ర పేద వారికి సహాయ, సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రసాద్, డైమండ్స్ చైర్మన్ కోన హనుమాన్ బాబు, రీజనల్ చైర్మన్ జయవరపు లక్ష్మి, వైస్ పెసిడెంట్ సింగంశెట్టి రమేష్, సభ్యులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



కొత్తకాయలతిప్పలో పంట బోదెలో పూడిక తీస్తున్న కూలీలు

మొగల్తూరు: సార్వాలో శివారు ప్రాంతాలకూ సాగునీరందించేందుకు ఉపాధి హామీ కూలీలతో పంట బోదెల్లో పూడిక తీయిస్తున్నారు. మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప నుంచి కేపీపాలెం నార్త్‌లోని భారీ మంచి నీటి చెరువుకు వెళ్లే పంటబోదెలో మట్టి, గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవునా పంట బోదెలో నిలిచిపోయిన గుర్రపు డెక్క, పూడికను తొలగించి మంచి నీటి చెరువుకు పూర్తిస్థాయిలో నీరందించేందుకు కృషి చేస్తున్నామని ఏపీఎం వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని తెలిపారు. సభ్యులంతా విధిగా హాజరుకావాలని కోరారు.

తెలంగాణ మద్యం సీసా స్వాధీనం

యలమంచిలి: చించినాడ వశిష్టా గోదావరి నది వంతెనపై సోమవారం వాహనాల తనిఖీ చేస్తుండగా మోటర్ సైకిల్‌లో తెలంగాణకు చెందిన మద్యం ఫుల్ బాటిల్ దొరికినట్టు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు. మద్యం సీసా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

కోదండ రామాలయంలో వార్షికోత్సవ పూజలు

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బోడపాటి వీర్రాజు దంపతుల ఆధ్వర్యాన స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష సహస్ర నామార్చన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్ఠ



రాయలంలో పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం అర్బన్: రాయలంలోని మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామివారి నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం సంప్రదాయ బద్ధంగా వేద మంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీర బ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సంప్రదాయ బద్ధంగా ఈ ప్రాంతంలో భక్తజన సందోహం మధ్య మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ నిర్వహించడం గొప్ప విశేషమన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కన్వీనర్లు తిరుమాని ఏడుకొండలు, తోట భోగయ్య, ఉభయ గోదావరి జిల్లాల సేవాదళ్ కన్వీనర్ చినిమిల్లి వెంకట్రాయుడు, చినిమిల్లి శ్రీనివాస్, కోళ్ల రామచంద్రరావు, చిప్పాడ ఈశ్వరపాండురంగ విఠలాచార్యులు, శివకాశీ, చిప్పాడ శ్రీనివాస్, కొమ్ముజు శివ శ్రీను, విజ్జేశ్వరరావు, అరిపాక రాంబాబు, పూడి మల్లేశ్వరరావు, విరాట్ విశ్వకర్మ యూత్ సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ పునఃప్రతిష్ఠకు రాట పూజ



పూజ చేస్తున్న దృశ్యం

ఆకివీడు: వచ్చేనెల 20వ తేదీన స్థానిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం పురస్కరించుకుని ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఆలయ సమీపంలోని పెద్దింటి అమ్మవారి ప్రాంగణంలో రాట పూజను మోటుపల్లి కృష్ణ దంపతులు నిర్వహించారు. రాట పూజ అనంతరం హోమం నిర్వహణకు, ఆలయ ప్రాంగణంలోనూ ప్రత్యేక పందిళ్ల నిర్మాణ కార్యక్రమం ప్రారంభిస్తారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపన సుబ్రహ్మణ్యం రాజు(ఏఎస్సార్), కార్యదర్శి నేరెళ్ల రామకృష్ణ, కమిటీ ప్రతినిధులు మోరా శ్రీనివాసరెడ్డి, జ్యోతి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ జగ్గరోతు విజయ్‌కుమార్, కుంచాడ బాబ్జీ, కిమిడి నాగరాజు, రామశాస్త్రి, కిమిడి లక్ష్మణ్, సుబ్బారెడ్డి, ఇల్లాపు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసన



భీమవరంలో రైతు, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

భీమవరం: కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అమలు చేయడంలో ముందుందని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఆకుల హరేరామ్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం డబ్ల్యూటీవో ఒప్పందం, మద్దతు ధర, ప్రభుత్వ హామీలు అమలు కోసం పోరాడుతున్న రైతాంగంపై అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా సోమవారం భీమవరంలో సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రదర్శన, ప్రకాశం చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హరేరామ్ మాట్లాడుతూ రైతుల పంటలకు కనీసం మద్దతు ధర చట్టం చేయాలని, డబ్ల్యూటీవో నిబంధనలను వ్యతిరేకించాలని, హర్యానా– ఢిల్లీ సరిహద్దుల్లో కాల్పులు జరిపి రైతు మరణానికి కారణమైన హర్యానా పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు లంక కృష్ణమూర్తి, జేఎన్వీ గోపాలన్, కోనాల భీమారావు, చెల్లబోయిన రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం



వలంటీర్లను సత్కరించిన దృశ్యం

వీరవాసరం: ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ సక్రమంగా అందేలా ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని రాయకుదురు సర్పంచ్ గెద్దం భారతి సూచించారు. సోమవారం గ్రామంలో సచివాలయ వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాలకు సంబంధించిన పూర్తిస్థాయి సమాచారాన్ని దగ్గర ఉంచుకుని, ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను అర్హులైన వారందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి బి.దుర్గాప్రసాద్, పోలిశెట్టి సత్యనారాయణ, గెద్దం భాస్కరరావు, షేక్ సత్తార్ సాహెబ్, ముత్యాల జగన్‌మోహన్, గూడూరి రాంబాబు, పంపన శ్రీను, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తెన్నేటి మాస్టారుకు గురుబ్రహ్మ పురస్కారం



తెన్నేటి మాస్టారును సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: కవి, రచయిత, పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, అక్షర కిరీటి తెన్నేటి లక్ష్మీనరసింహామూర్తి (తెన్నేటి మాస్టారు)ని గురుబ్రహ్మ అవార్డు వరించింది. హైదరాబాద్‌కు చెందిన ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ 19వ వార్షికోత్సవ వేడుల్లో భాగంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురిని సోమవారం సన్మానించింది. ఈ సందర్భంగా అక్షర కిరీటి తెన్నేటి మాస్టారు తెలుగు భాషకు చేస్తున్న కృషిని గుర్తించి ప్రోత్సహిస్తూ గురుబ్రహ్మ అవార్డు 2024ను నిర్వాహకులు ప్రకటించారు. రిటైర్డ్ హైకోర్టు జడ్జి, తెలంగాణ మానవ హక్కుల సంఘం మాజీ చైర్మన్ డాక్టర్ జి.చంద్రయ్య, సంస్థ ఫౌండర్ ప్రెసిడెంట్ లయన్ సూర్యనారాయణ, దైవజ్ఞ శర్మ, మందాడి కృష్ణారెడ్డి తదితరులు తెన్నేటికి అవార్డును అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా తెన్నేటి మాస్టారు మాట్లాడుతూ వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురిని సన్మానించడం, అందులో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వారిని గౌరవించడం ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఉత్తమ సౌజన్యమన్నారు. ఈ స్ఫూర్తితో మరింతగా తెలుగు భాషకు తనవంతు కృషి చేస్తానన్నారు. తెన్నేటి మాస్టారును రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్వీయస్ రాజు, మన వంశం ఎడ్మిన్ మణిధర్, శ్రీశ్రీ కళావేదిక పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు యండపల్లి పాండురంగ ఆచార్యులు, ఐక్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యలమర్తి శ్రీనివాసాచార్యులు, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు బాలాజీ, కార్యదర్శి తులసీ ప్రదీప్, గోదావరి సాహితీ ప్రభ కార్యదర్శి రమా ప్రతిభ, పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహేష్‌బాబు తదితరులు అభినందించారు.

సత్తెమ్మ అమ్మవారిని దర్శించుకున్న పీవీఎల్



సత్తెమ్మ అమ్మవారి ఆలయంలో పీవీఎల్

ఉండి: మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో వేంచేసియున్న సత్తెమ్మ అమ్మవారి 59వ జాతర మహోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఉండి, ఆకివీడు, కాళ్ళ, భీమవరం తదితర మండలాల నుంచి భక్తులు వేల సంఖ్యలో విచ్చేసి అమ్మవారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా నీతి, నిజాయితీలో కూడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే మరోసారి విజయం చేకూర్చాలంటూ అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన చెప్పారు. జాతర మహోత్సవాలను ఎంతో అట్టహాసంగా నిర్వహించిన కమిటీ ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. నర్సయ్య అగ్రహారం, మెంటేవారి తోట, వేంద్ర కెనాల్ రోడ్డు, కోడవల్లి రోడ్డు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ తెలిపారు.

వృద్ధులను ఆదుకోవడం మానవ ధర్మం



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న దృశ్యం

భీమవరం: సమాజంలో వృద్ధాప్యం, పేదరికంతో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం కనీస మానవ ధర్మమని భీమవరం సబ్ జైల్ సూపరింటెండెంట్ వెంకటగిరి అన్నారు. వృద్ధాప్యంతో బాధపడుతున్న భీమవరం 19వ వార్డుకు చెందిన బందారు రామచంద్రరావుకు విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యాన సోమవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణానికి చెందిన నరమామిడి గంగారామ్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన బియ్యం, నిత్యావసర సరుకులు అందించినట్లు సేవా సంస్థ ప్రతినిధి అల్లు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఇందుకూరి శివాజీవర్మ, వాల్మీకి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): పల్స్ పోలియోను అన్ని శాఖల సమన్వయంంంతో విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. సోమవారం పల్స్ పోలియో కార్యక్రమంపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3వ తేదీ ఆదివారం జిల్లాలో నిర్వహించనున్న పల్స్ పోలియో వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, పర్యవేక్షకులకు కింది స్థాయి సిబ్బందికి ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు.తొలి రోజు పోలియో చుక్కలు పొందని పిల్లలకు 4, 5 వ తేదీల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. తొలిరోజునే నూరు శాతం లక్ష్యం దిశగా సిబ్బంది కృషి చేయాలన్నారు. జిల్లాలో 5 ఏళ్ల లోపు పిల్లలు 1,85953 మంది ఉన్నారని వారికోసం 1,315 పోలియో కేంద్రాలను అందులో 45 మొబైల్ కేంద్రాలు, 34 ట్రాన్సిస్ట్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 5,260 మంది వాక్సినేటర్లను సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలో 181 రూట్లకు ఒక్కొక్క వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. అందరు సమష్టి పని చేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కష్టపడే ప్రతి ఒక్కరికీ గుర్తింపు

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తింపు ఉంటుందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ బాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో భాగంగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా సహాయ కార్యదర్శులుగా నియమితులైన ఝాన్సీ లారెన్స్, పైడి పద్మలను మంత్రి కారుమూరి, నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అభినందించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లారెన్స్‌కు పుష్పగుచ్ఛం అందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, పార్టీ యువజన విభాగం తణుకు నియోజకవర్గ అధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, ఉపాధ్యక్షుడు యడ్లపల్లి సురేంద్ర పాల్గొన్నారు.

గడపగడపకు నిధులతో అభివృద్ధి పనులు



ఏనుగువానిలంకలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ సర్పంచ్ రవి

యలమంచిలి: గడపగడపకు మన ప్రభుత్వ నిధులతో ఏనుగువానిలంక గ్రామంలో దళితపేటల్లో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు మాజీ సర్పంచ్ వినుకొండ రవి చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వ నిధులు రూ.20 లక్షలతో స్థానిక అరుందతీపటలో చేపట్టే సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గత ఐదేళ్లలో ఏనుగువానిలంకలో ప్రతి వార్డునూ అభివృద్ధి చేశామన్నారు. జగనన్నకు మరొసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈద ప్రమీల పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మల్లుల కొండ, ఉల్లంపర్తి జాన్ వైఎస్సార్ సీపీ నాయకులు మేళం రామాంజనేయులు, బళ్ల నాగేశ్వరరావు, పాలపర్తి మేరీపుష్ప, దిడ్ల విజయ్‌కుమార్, వినుకొండ శ్రీనివాసరావు, పాలపర్తి సందీప్‌కుమార్, పిడకాల బాబూరావు, సిద్ధిరెడ్డి రాంబాబు పంచాయతీరాజ్ ఏఈ వర్ధనపు శ్యాంబాబు, పంచాయతీ కార్యదర్శి అడబాల కోదండరామయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అడబాల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెనుమర్రు శివాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ఉమా వైద్యనాథేశ్వరస్వామిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గోపి

యలమంచిలి: పెనుమర్రు గ్రామంలోని ఉమా వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో పునర్మించిన రాజగోపుర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మూడురోజుల కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శైవాగమ పండితులు బాదంపూడి చిరంజీవిశర్మ బ్రహ్మత్వంలో అర్చకులు బాదంపూడి వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో దివ్య ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. దంపతులు పాత్తూరి సోమరాజు, వెంకట సుబ్బలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని ప్రతిష్ఠా పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సోమవారం ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదం స్వీకరించారు. ఆయన వెంట సర్పంచ్ కవురు గోపి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమార దత్తాత్రేయవర్మ, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాకా సూర్యనారాయణ, గుడాల సురేష్ తదితరులు ఉన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష



మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న తహసీల్దార్ లక్ష్మీకల్యాణి

పెనుమంట్ర: నత్తారామేశ్వరం రామేశ్వరస్వామివారి దేవస్థానం వద్ద మార్చి 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించే మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ బందోబస్తు, స్నానఘట్టాలు పరిశుభ్రతపై, పారిశుద్ధ్య నిర్వహణపై చర్చించారు. మహాశివరాత్రి రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగు సూచనలు చేశారు. సత్యసాయి సేవాసంస్థలకు చెందిన 250 మంది వాలంటీర్లు క్యూ కాంప్లెక్స్‌ల వద్ద అన్నదాన కార్యక్రమాల వద్ద సేవలు అందిస్తారని సత్యసాయి సేవాసంస్థల కన్వీనర్ రాగు కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పద్మజ, ఈవోఆర్డీ రామ్‌ప్రసాద్, విద్యాశాఖాధికారి యు.నాగేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ కర్రి రామారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కర్రి ప్రభాకర్‌రెడ్డి, కర్రి చంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తమనంపూడి అయ్యప్పరెడ్డి, బీజేపీ నాయకుడు కర్రి కల్కిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవ చేయాలి

తాడేపల్లిగూడెం: విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో కూడా పాలుపంచుకోవాలని వాసవి ఇంజినీరింగ్ కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గ్రంధి సత్యనారాయణ కోరారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం శిబిరం ముగింపు సందర్భంగా జరిగిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కూడా సమాజసేవా కార్యక్రమాల్లో భాగంగా మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన వైద్యులు సేవలందించారు. సర్పంచ్ యాతం కోటేశ్వరి, గ్రామ కార్యదర్శి ఎ.శ్రీనివాసు, ఎంపీటీసీ దుర్గాదేవి, వైద్యులు తరుణ్‌సాయి, భానుప్రకాష్, చందన సాయిలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.రాజశేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుడాల గోపి

పోడూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఆపార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి పిలుపునిచ్చారు. పెనుమదం గ్రామంలో సోమవారం మండల కన్వీనర్ పితాని చిన్నా అధ్యక్షతన మండల స్థాయిలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై గోపి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సమస్యల పరిష్కారానికి, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు మాట్లాడుతూ పాలకొల్లు నియోజవర్గం నుంచి గుడాల గోపిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు, గోపిని, ఎస్సీ కమిషన్ సభ్యులు ఆనందప్రకాష్, జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, మండల కన్వీనర్ చిన్నా తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షులు, గ్రామకమిటీ అధ్యక్షులు, పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సామాజిక వర్గానికి పెద్దపీట



మాట్లాడుతున్న శెట్టిబలిజ సామాజిక వర్గీయులు

పాలకొల్లు అర్బన్: అసెంబ్లీ, పార్లమెంటు సీట్ల కేటాయింపులో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని వైఎస్సార్ సీపీకి చెందిన పలువురు శెట్టిబలిజ సామాజిక వర్గీయులు తెలిపారు. వైఎస్సార్ సీపీ పాలకొల్లు కార్యాలయంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. మూడు అసెంబ్లీ, రెండు పార్లమెంట్ సీట్లను శెట్టిబలిజ సామాజిక వర్గానికి కేటాయించినందుకు సీఎం జగన్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, జనసేన పార్టీలు శెట్టిబలిజ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. నరసాపురం, రాజమండ్రి పార్లమెంటు సీట్లతో పాటు పాలకొల్లు, రాజమండ్రి రూరల్, రామచంద్రాపురం అసెంబ్లీ సీట్లను శెట్టిబలిజ సామాజికవర్గానికి సీఎం కేటాయించారని తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని శెట్టిబలిజ సామాజిక వర్గాలతో పాటు బహుజన వాదులంతా సీఎంకి అండగా నిలవాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పాటయిన తరువాత పాలకొల్లులో ఒకసారి మాత్రమే వైశ్య సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీ కేటాయించిందని, అయితే ఎప్పుడూ ఇక్కడ నుంచి కాపులే పోటీ చేస్తున్నారని వివరించారు. తొలిసారిగా పాలకొల్లు అసెంబ్లీ సీటు శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)కి కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని శెట్టిబలిజ వర్గీయులంతా గోపికి అండగా నిలిచి అసెంబ్లీకి పంపించాలని కోరారు. సమావేశంలో శీలం సూరిబాబు, వేండ్ర సింహాచలం, కుక్కల యుగంధర్, వీరవల్లి కృష్ణ, కుక్కల బాలచంద్ర, నున్నబోయిన వెంకటేశ్వరరావు, చింతపల్లి వాసు తదితరులు మాట్లాడారు.